జలం కలుషితం.. కలవరం



వందల గ్రామాలకు తాగునీరు, వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పెన్నానది.. కాలుష్య కోరల్లో చిక్కుకుంది. నెల్లూరు నగర పరిధిలోని ఆవాసాల నుంచి వచ్చే మురుగునీరు, వ్యర్థాలు నదిలో కలుస్తూ జలాలు కలుషితం అవుతున్నాయి. నెల్లూరు నగరం పొర్లుకట్ట నుంచి పెన్నా బ్యారేజీ వరకు జయలలితనగర్, గుప్తాపార్కు, నారాయణరావుపేట, ఈద్గామిట్ట, సంతపేట తదితర ప్రాంతాలు వద్ద ఈ పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ నుంచి మురుగునీరు, వ్యర్థాలు పెన్నానదిలో కలవకూడదన్న ఉద్దేశంతో 2014లో తెదేపా ప్రభుత్వం రూ.550 కోట్లతో నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టింది. 90శాతం పూర్తయ్యాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పదిశాతం పనులు పూర్తిచేసి ఉంటే నది మురుగునీటితో కలుషితం అయ్యేది కాదు. కలుషిత జలాల కారణంగా రక్షిత మంచినీటి పథకాల నీరు కలుషితమై ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉంది. - ఈనాడు, నెల్లూరు



అష్టలక్ష్మీ ఆలయంలో చండీదేవిగా..

దుర్గాదేవిగా కన్యకా పరమేశ్వరి

నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా..

త్రివిక్రమ అవతారంలో బుచ్చికోదండరామస్వామి

సూర్యప్రభపై కావలి బృందావన శ్రీవారు

జగజ్జననికి జనహారతి



శరన్నవరాత్రి సంబరాలు.. అంబరాన్ని అంటాయి. అమ్మ దర్శనంతో.. అద్వితీయ ఆధ్యాత్మికతో భక్తజనం పరవశిస్తోంది. గురువారం దర్గామిట్ట రాజరాజేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో శనివారం నిర్వహించే రావణదహన కార్యక్రమ ఏర్పాట్లను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు. అమ్మవారికి నగరానికి చెందిన రావులపల్లి వెంకటరామానాయుడు, సులోచనమ్మ దంపతులు బంగారు పూత వేసిన కిరీటాన్ని అందించారు. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరిదేవి.. దుర్గాదేవిగా భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారిని మంత్రి నారాయణ సతీమణి రమాదేవి దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

మండల కేంద్రాల్లో ప్రత్యేక దుకాణాలు: జేసీ

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: వినియోగదారులపై భారం పడకుండా అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి ఉత్పత్తి ధరకే నిత్యావసరాలు అందించేలా చర్యలు చేపట్టాలని జేసీ కార్తీక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా స్థాయి ధరల స్థిరీకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, ఎర్రగడ్డలు, టమోటాల ధరల పెరుగుదలను అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక దుకాణాల్లో పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌తో పాటు ఎర్రగడ్డలు, కందిపప్పు, మినపప్పు కూడా అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధరల పెరుగుదల సందర్భంగా వ్యాపారులు వినియోగదారులను మోసం చేయకుండా కచ్చితమైన తూకం అందించేలా తూనికలు కొలతలశాఖ అధికారులు తనిఖీ చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో వెంకటరమణ, మార్కెటింగ్ ఏడీ అనిత, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఐజాగ్, సివిల్ సప్లయ్స్ డీఎం లక్ష్మీనరసింహరావు, వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి, ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

విలువల పారం.. పల్లె గడపలో సేవా దీపం!



న్యూస్‌టుడే, వెంకటాచలం, తిరుపతి (వైద్యం)

నైతిక విలువలే పునాది.. నాణ్యతలో రాజీపడని ధోరణి.. దేశ హితమే పరమావధి.. ప్రజల్లో అచంచెల విశ్వాసం పాదుకొలిపి రూ. లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మిస్తూనే.. భూరి విరాళాలతో విద్యా, వైద్య, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఇతోధిక తోడ్పాటు అందించారు ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా(86). మారుమూల గ్రామాలకూ తమ దాతృత్వ పరిమళాలను విస్తరింపజేశారు. దేశ ప్రగతిలో.. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అందుకు నిదర్శనం. . గొలగమూడిలోని టాటా హాస్టల్, తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రిసెర్చి సెంటర్ (స్వీకార్), శ్రీసిటీలోని టాటా స్మార్ట్ ఫుడ్ లిమిటెడ్(టీఎస్ఎఫ్ఎల్).

గొలగమూడిలో 'టాటా' హాస్టల్



టాటా నిధులతో గొలగమూడి ఆశ్రమంలో నిర్మించిన హాస్టల్

గొలగమూడి ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం విజ్ఞప్తికి స్పందించిన టాటా ట్రస్టు నిర్వాహకులు. . 2012లో రూ. కోటి విరాళం అందజేశారు. ఆ మొత్తంతో ఆశ్రమ ప్రాంగణంలో పేద విద్యార్థుల కోసం వసతిగృహం నిర్మించారు. ఈ భవనానికి 'టాటా హాస్టల్' అని పేరు పెట్టారు. ప్రస్తుతం ఇక్కడ పేద విద్యార్థులకు ఉచితంగా విద్య, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మారుమూల గ్రామం గొలగమూడిలోనూ టాటా ట్రస్టు నిధులు ఇవ్వడంపై స్థానికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఆశ్రమ అభివృద్ధి, వసతిగృహం నిర్మాణానికి తోడ్పాటు అందించిన రతన్ టాటా మృతి వార్తతో.. ఇక్కడ విషాద ఛాయలు అలుముకొన్నాయి. ఈ సందర్భంగా గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం ఈవో, విశ్రాంత ఐఏఎస్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. 'టాటా సంస్థలో నేను ఏడేళ్లపాటు జీతం తీసుకోకుండా పని చేశా. ఆ సంస్థ నాగపట్నంలో చేపట్టిన సునామీ ప్రాజెక్టుకు, కోల్‌కతాలో క్యాన్సర్ ఆసుపత్రికి డైరెక్టర్‌గా పనిచేశా. రతన్ టాటా క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో.. ఆయనతో మాట్లాడాను. తాను కోరిన వెంటనే టాటా ట్రస్టు ద్వారా రూ. కోటి విరాళం అందజేశారు. ఆ నిధులతో విద్యార్థులకు వసతిగృహం నిర్మించాం. వెంకయ్యస్వామి ఆశ్రమానికి టాటా ట్రస్టు అందించిన తోడ్పాటు మరువలేం' అని కొనియాడారు.


జిల్లా వాసులకు వరం.. 'స్వీకార్'

క్యాన్సర్ బారి నుంచి పేదలను కాపాడేందుకు అధునాతన వైద్య సేవలను టాటా ట్రస్టు అందుబాటులోకి తెచ్చింది. శ్రీవారి పాదాల చెంత(తిరుపతి జూపార్కు రోడ్డులో) తితిదే 25 ఎకరాల స్థలాన్ని నామమాత్రపు లీజుతో కేటాయించగా- రూ. 250 కోట్ల వ్యయంతో శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రిసెర్చి సెంటర్ (స్వీకార్)ను ఏర్పాటు చేసింది. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ఈ ఆసుపత్రి ఏర్పాటుకు ముందుకొచ్చింది. 2018, ఆగస్టు 31న స్వీకార్‌కు చంద్రబాబునాయుడుతో కలిసి.. రతన్‌టాటా భూమి పూజ చేశారు. ప్రారంభంలో పది పడకలతో కీమోథెరపీ సేవలు అందుబాటులోకి తీసుకురాగా.. ప్రస్తుతం వంద పడకలతో సేవలందిస్తోంది. ఓపీల సంఖ్య 300కు చేరింది. నెలకు 1,100 వరకు కీమోథెరపీలు, రోజూ 85 మందికి రేడియేషన్, ప్రతి నెలా సరాసరిన 130 మేజర్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రజలకు ఈ ఆసుపత్రి వరంగా నిలిచింది. ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్ నెట్‌వర్క్‌జాబితాలో ఉంది. రోగులకు ఉచితంగా వసతి, భోజనం కల్పిస్తోంది. టోల్‌ఫ్రీ ద్వారా ముందస్తుగా ఓపీ నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఏఆర్ అదనపు ఎస్పీగా మునిరాజా

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ జి. శ్రీనివాసరావు గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా గురువారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న జి. మునిరాజాకు ఉద్యోగోన్నతి కల్పించి నెల్లూరు ఏఆర్ అదనపు ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐడీ పార్టీ పోలీస్ పేరుతో బెదిరింపులు



నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఐడీ పార్టీ పోలీసునంటూ బెదిరించడమే కాకుండా డబ్బులు డిమాండ్ చేసిన ఓ మాజీ హోంగార్డుపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కొత్తూరు అంబాపురానికి చెందిన రియాజ్ గతంలో పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేశాడు. తాను పోలీసునంటూ పలువురిని బెదిరిస్తూ నగదు వసూళ్లకు పాల్పడుతుండటంతో గతంలో పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. గతేడాది పోలీసు ఉన్నతాధికారులు అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ నెల 8వ తేదీ రాత్రి పొగతోట నుంచి పని ముగించుకుని ధనలక్ష్మీపురంలోని నివాసానికి బైక్‌పై వెళ్తున్న వైద్యుడు విశ్వనాథ్‌ను అపోలో ఆసుపత్రి జంక్షన్ వద్ద రియాజ్ అడ్డగించి.. తాను సీఐ ఐడీ పోలీసునంటూ వైద్యుడిని బెదిరించాడు. బైక్ తాళం లాక్కొవడమే కాదు.. రూ. 20 వేలు డిమాండ్ చేశాడు. తాను ఏం తప్పు చేశానని, డబ్బులు ఎందుకు ఇవ్వాలంటూ రియాజ్‌ను ప్రశ్నించి.. అతనిని, బైక్‌ను సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీయడంతో బైక్ తాళాలు ఇచ్చి పరారయ్యాడు. విశ్వనాథ్ గురువారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు రియాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓవీ రోడ్డు విస్తరణకు భూముల పరిశీలన



భూముల వివరాలు పరిశీలిస్తున్న ప్రకాశం జేసీ గోపాలకృష్ణ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కందుకూరు నుంచి సింగరాయకొండ జాతీయ రహదారి వరకు జరుగుతున్న '167బీ'ని నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కసరత్తు మొదలైంది. ప్రస్తుతం నిర్మిస్తున్న జాతీయ రహదారికి 45 మీటర్ల వెడల్పున 2016లో భూసేకరణ చేశారు. కాగా, కందుకూరు- సింగరాయకొండ వెళ్లే ఓవీ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని, రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయాలని ప్రజల నుంచి వినతులు అందాయి. దాంతో ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న రహదారికి అదనంగా మరో 20 మీటర్ల వెడల్పున భూసేకరణ చేసేందుకు ప్రతిపాదించారు. ఆ మేరకు గురువారం ప్రకాశం జిల్లా జేసీ రోణంకి గోపాలకృష్ణ గురువారం ఓవీరోడ్డును పరిశీలించారు. ఓగూరు, పలుకూరు అడ్డరోడ్డు, చెర్లోపాలెం కూడలి ప్రాంతాలను పరిశీలించి ఏ ప్రాంతంలో ఏ మేరకు భూసేకరణ చేస్తున్నారో స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూములకు ప్రభుత్వ, బహిరంగ మార్కెట్ విలువలో వ్యత్యాసాలు సేకరించారు. త్వరలోనే నాలుగు లైన్ల రహదారికి సంబంధించిన భూసేకరణ నోటిఫికేషన్ వెలువడనుందని తెలిపారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ టి. శ్రీపూజ, తహసీల్దారు ఇక్బాల్ ఉన్నారు.

కండలేరు కాలువకు.. లీకేజీల బెడద



ఇదేదో సాగునీటి కాలువ అనుకునేరు.. కండలేరు వరద కాలువ నుంచి వచ్చే లీకేజీ నీరు. ఈ ప్రవాహం లీకేజీ తీవ్రతకు అద్దం పడుతోంది.

తెలుగుగంగ కాలువకు లీకేజీల బెడద పెద్ద సమస్యగా మారింది. ఇదే తరహాతో గతంలో రైతులు, అధికారులు దశాబ్దంపైనే ఇబ్బంది పడ్డారు. అనంతర చర్యలతో పరిస్థితి కొంతమేర చక్కబడినట్లే కనిపించినా.. గత వైకాపా ప్రభుత్వం సామర్థ్యం రెట్టింపు చేస్తామంటూ చేపట్టిన పనులు.. సమస్యను రెట్టింపు చేశాయి.

ఆత్మకూరు, న్యూస్‌టుడే

సోమశిల- కండలేరు వరద కాలువను తెలుగు గంగ పథకంలో భాగంగా 12 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించారు. వరదల కాలంలో ఇందులో రోజుకు టీఎంసీ తరలించాలన్నది లక్ష్యం. జలాశయం నుంచి మొదటి 3.2కి.మీ.లో కొండ అంచును తొలచి.. కాలువ నిర్మించారు. కొండవైపు కాంక్రీట్ లైనింగ్, పెన్నానది వైపు కాంక్రీట్‌వాల్ ఏర్పాటు చేశారు. మొదటిసారి నీటి విడుదల తర్వాత కొండవైపు ఉన్న గట్టు జారిపోయింది. అనంతరం అదే పరిస్థితి కొనసాగగా.. సమస్య ఉద్ధృతమైంది.

నిపుణుల పరిశీలన

సమస్య తీవ్రత నేపథ్యంలో నిపుణుల అధ్యయనం అనంతరం.. జారిన కొండ అంచును తొలగించారు. తిరిగి లైనింగ్‌తో పాటు లీకేజీల నివారణకు మొదటి కి.మీ. గ్రౌటింగ్ చేశారు. 3.2 కి.మీ. అనంతరం కాంక్రీట్ లైనింగ్ చేశారు. కాలువను ఆనుకుని ఉన్న కొండ కోనల వైపు నుంచి వచ్చే లీకేజీని తరలించేలా ప్రత్యేక కాలువలు ఏర్పాటు చేశారు. ఆ నీరు పెన్నానదిలో కలిసేలా కల్వర్టు నిర్మించారు.

గత ప్రభుత్వ హయాంలో...

వైకాపా ప్రభుత్వ కాలంలో రోజుకు రెండు టీఎంసీలు తరలించేలా వెడల్పు పనులు చేపట్టారు. ఆ క్రమంలో దక్షిణం వైపు లైనింగ్ తొలగించడంతో.. లీకేజీ సమస్య ఉద్ధృతమైంది. పొలాల్లోకి వచ్చిన నీటిని.. లీకేజీ కాలువలోకి తరలించగా.. ఆ ఉద్ధృతికి కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయింది. 3.2 కి.మీ. నుంచి దక్షిణ కాలువ ఉండటంతో లీకేజీ నీరు అందులోకి చేరుతోంది. ఈ పరిస్థితుల్లో ఇంకా ఏయే సమస్యలు ఎదురవుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.



సోమశిల- కలువాయి మార్గంలోని ఈ ప్రాంతంలో పైపులతో నిర్మించిన కల్వర్టు ఉండేది. కండలేరు వరద కాలువ ఉద్ధృతికి కల్వర్టు, సీసీ రోడ్లు కొట్టుకుపోయి గండి ఏర్పడింది.

ఆందోళన అవసరం లేదు..

లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించాం. కాలువకు ఇబ్బంది కలిగించే పరిస్థితి లేదు. నివారించేందుకు చర్యలు తీసుకుంటాం. - ఎం.వెంకటరమణారెడ్డి, ఇన్‌ఛార్జి ఎస్ఈ, తెలుగుగంగ

ఇసుక విక్రయాల్లో.. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పొదలకూరు, న్యూస్‌టుడే: ఇసుక విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. సూరాయపాళెం రీచ్‌ను గురువారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులో పది వేల మెట్రిక్ టన్నుల నిల్వ ఉన్నట్లు సిబ్బంది వివరించారు. గురువారం డ్రెడ్జింగ్ ద్వారా 343 ట్రాక్టర్ల ఇసుక యార్డుకు తరలించామని, 343 టన్నులు విక్రయించామని తెలిపారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ.. జీపీఎస్ వాహనాలనే వినియోగించాలని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలందించాలని ఆదేశించారు. అనంతరం మహ్మదాపురంలో సీఎస్సార్ నిధులతో నిర్మిస్తున్న బీసీ, సంక్షేమ వసతిగృహాలను పరిశీలించారు. దాతలు దొడ్ల కుటుంబ సభ్యుల సదాశయాన్ని కొనియాడారు. దాత శేషారెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణాలను వచ్చే నెలలో పూర్తి చేస్తామన్నారు. పొదలకూరు ఎక్సైజ్ స్టేషన్‌ను పరిశీలించి.. సూచనలు చేశారు.



సూరాయపాళెం ఇసుక రీచ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్



బంగారం పడేయమన్న బావమరిది ఎవరో తెలుసా..?

'మండంగుండ లేని తుపాకీ 60 మందిని కల్చితే అది నచ్చి మాకు ఎల్లో ఎడికోల మాస్కు ఇచ్చారు. దాంతో బాగా అటుకుతుండాం... ఏదు సుక్కున్న పాలి ఉంటే పాలు పట్టేందుకు వాటి వెనకాల మోటరు పెట్టాం. తెల్ల వార్లు పాలు వస్తాని.. ఉంటాయి. వేపాకు పచ్చడి, దురద గుంటాకు ఆకుకూర, జబుకాయలు మిరపపిండి, కిరసనాయిల్ తాలింపుతో చేసిన వంటలు తింటాం. మాకు ఆస్తులకు కొదవలేదు. గుమ్మడంత బంగారం ఇంట్లో కుక్క నాకింది. దాంతో అంటు బంగారం ఇంట్లో ఉండకూడదని మా బావమరిది చెబితే వీధిలో పడేశాం. ఇంతకీ మా బావమరిది ఎవరో మీకు తెలుసా ఆయనే చంద్రబాబునాయుడంటూ' జనాలను కడుపుబ్బ నవ్విస్తూ సంగంలో దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం పిట్టల దొరలు సందడి చేశారు. – న్యూస్‌టుడే, సంగం

అధికారుల నిర్లక్ష్యం..
వాహనదారులకు ప్రాణసంకటం
బైకు బోల్తా.. ముగ్గురికి గాయాలు

కలిగిరి, న్యూస్‌టుడే: జాతీయరహదారుల ఉదాసీనత కారణంగా కావలి రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడైనా పనులు జరుగుతుంటే హెచ్చరిక బోర్డులు పెట్టాలి. కానీ కావలి మార్గంలో ఇవి లేకుండా చేస్తున్నారు. రహదారికి అడ్డుగా కంకర పోశారు. రాత్రిళ్లు ఈ గుట్టను ఢీకొని వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇలాగే గురువారం రాత్రి మోటార్ బైక్ బోల్తా పడగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పెమ్మసాని గార్డెన్స్ సమీపంలో టోల్‌ప్లాజా ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. రోడ్డుకు అడ్డుగా కంకర, రాళ్లు పోశారు. రాత్రి కావడంతో వీటిని గమనించక మోటారుబైకుపై వస్తూ ఢీకొట్టడంతో పడిపోయారు. దీంతో దీన్ని నడుపుతున్న వ్యక్తితో పాటు, అన్నదమ్ముళ్లైన చిన్నారులు వంశీకృష్ణ, ఏసు బాబు కింద పడడంతో గాయాలయ్యాయి. పోలీసుకు అపస్మారక స్థితిలో ఉండడంతో వివరాలు పూర్తిస్థాయిలో తెలియలేదు. ఇతను ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. తమది సంగం మండలం కోరిమెర్ల, తండ్రి వెంకయ్య అని, తల్లి దగ్గరకు వెళ్తున్నట్లు చిన్నారులు తెలిపారు. బైకు నడుపుతున్న వ్యక్తి మామ అని అంటున్నారు. వీరిని 108 వాహనంలో కావలికి తరలించారు.



గాయాలపాలైన చిన్నారులు

పొగనారుకు చిరునామా ఓగూరు



పొగాకు ధరలు ప్రతి ఏడాది పెరుగుతుండటంతో సాగు విస్తీర్ణం అంతకంతకు పెరుగుతూనే ఉంది. అందుకనుగుణంగా మండలంలోని ఓగూరులో సుమారు 35ఎకరాల్లో రైతులే భూమిని కౌలుకి తీసుకుని నారుమడులు పెంచారు. ఈ ఏడాది మొదట్లోనే ఒక మాట నారు రూ.2300ల వరకు పలుకుతుండడం విశేషం. ఒక్క ఓగూరులోనే సాగు చేసిన నారుమడికి ఎకరానికి సుమారు రూ.నాలుగు లక్షలు వచ్చిందంటారు.. డిమాండ్ ఎలా ఉందో తెలుస్తోంది. అందులోనూ ఓగూరు నారు అంటే ఎక్కువగా కొనుగోలు చేస్తారని స్థానిక రైతులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

వీఎస్‌యూలో స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలో జరుగుతున్న డిగ్రీ హానర్స్, ఐసెట్ స్పాట్ అడ్మిషన్ల గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు అడ్మిషన్స్ డైరెక్టర్లు ఆచార్య హనుమారెడ్డి, సాయినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు పొందేందుకు ఐసెట్-2024లో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 94415 99597, 99893 53455 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

నీరు లేక పంటలు పండక
వలసబాటలో గ్రామీణులు



నీరు లేని రామానుజాపురం చెరువు

న్యూస్‌టుడే, కొండాపురం, ఉదయగిరి

మెట్ట ప్రాంతంలో సాగునీటి వనరులపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షాభావంతో చెరువులకు నీరు రావడం లేదు. వీటికి సోమశిల నుంచి అందించాలన్న ప్రతిపాదనలకు ఏళ్లు గడుస్తున్నా మోక్షం కలగడం లేదు. దీంతో పంటలు పండక జీవనం సాగక వలస బాట పడుతున్నారు. వీటిని ఆపేందుకు చెరువులకు నీరు ఇవ్వాల్సి ఉంది. ఈమేరకు పనులు చేయాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కొండాపురం మండలంలోని కొమ్మి పంచాయతీ రామానుజాపురం చెరువుకు చుక్కనీరు వచ్చే పరిస్థితి లేక రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సన్నకారు రైతులే అధికం. ఒకప్పుడు సకాలంలో వర్షాలు పడడంతో గ్రామ పరిధిలోని చెరువుకు పుష్కలంగా నీరు వచ్చేది. దీంతో పంటలు పండేవి. వాతావరణ మార్పులతో వర్షాలు తగ్గిపోయాయి. దీంతో పంటలు పండక పూట గడవక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు. 20 ఏళ్ల కిందట ఏటా సుమారు 400 ఎకరాల్లో సాగు జరిగేది. ప్రస్తుతం 200 ఎకరాల్లో మాత్రమే పండిస్తున్నారు. నీటి వసతి లేక ఎక్కడ చూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. బోర్లు ఉన్న చోట కొందరు సాగు చేస్తున్నారు. గత మూడేళ్లలో 80 బోర్లు వేశారు.

కాలువ నిర్మాణం ప్రశ్నార్థకం

సోమశిల ఉత్తర కాలువ ద్వారా కలిగిరి మండలంలోని క్రాకుటూరు మేజర్ కాలువ నుంచి నీరు అందించాలని అధికారులు గతంలో ప్రతిపాదనలు చేశారు. శ్రీకొలను డిస్ట్రిబ్యూటరీ నుంచి కలిగిరి మీదుగా కొండాపురం మండలంలోని మర్రిగుంట చెరువు వరకు ఉత్తర కాలువ నిర్మాణం పూర్తి చేశారు. దీని ద్వారా 150 క్యూసెక్కులు నీటిని రాళ్లపాడు జలాశయానికి అందిస్తున్నారు. ఇదే క్రమంలో నిర్మాణం చేయాల్సిన క్రాకుటూరు నుంచి అన్నవరం మెజర్ డిస్ట్రిబ్యూటరీ కాలువ మీదుగా రామానుజాపురం చెరువు వరకు పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. దీంతో వ్యవసాయ భూములు బీడు భూములుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నాళ్లయినా అసంపూర్తే..

క్రాకుటూరు డిస్ట్రిబ్యూటరి ఛానల్ నుంచి దిగువ కాలువ పూర్తిచేశారు. 10 కిలో మీటర్ల వరకు నాలుగు కల్వర్టులు, ఎర్త్‌వర్కులు చేయాల్సి ఉంది. ఇక్కడి నుంచే అన్నవరం మేజర్ డిస్ట్రిబ్యూటరీ మీదుగా కాలువ నిర్మాణం జరగాలి. అన్నవరం డిస్ట్రిబ్యూటరీ నుంచి రామానుజాపురం చెరువు వరకు మరో 10 కి.మీ దూరం చేయాల్సి ఉంది. ఇవన్నీ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఎమ్మెల్యే చొరవ తీసుకుని నిర్మాణం పూర్తి చేయించాలని అన్నవరం, రామానుజాపురం, కుంకువారిపాలెం గ్రామాల రైతులు కోరుతున్నారు.

అంచనాలు పంపించాం.. కొండారెడ్డి, ఏఈ, సోమశిల

కాలువ నిర్మాణానికి గతంలో ఉన్నతాధికారులకు అంచనాలు తయారు చేసి పంపించాం. వీటికి అనుమతి రావల్సి ఉంది. రాగానే పనులు ప్రారంభిస్తాం.

ఉద్యోగుల బదిలీపై పూర్తి వివరాలు సమర్పించండి
నెల్లూరు జడ్పీ సీఈవోకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల బదిలీ విషయంలో తనను సంప్రదించకుండా ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈవో) ఉత్తర్వులు జారీచేశారని పేర్కొంటూ నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ దాఖలు చేసిన వ్యాజ్యంలో పూర్తి వివరాలు సమర్పించాలని సీఈవోకు హైకోర్టు స్పష్టంచేసింది. విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత గురువారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జడ్పీ ఉద్యోగుల బదిలీ విషయంలో ఛైర్‌పర్సన్ ఆమోదం తప్పనిసరి అన్నారు. ఈ నిబంధనలను పక్కనపెట్టి సీఈవో బదిలీలకు ఆమోదం తెలిపారన్నారు. బదిలీ ఉత్తర్వులను అమలుకాకుండా నిలుపుదల చేయాలని కోరారు. సీఈవో తరఫు న్యాయవాది అపర్ణలక్ష్మి వాదనలు వినిపిస్తూ బదిలీల ఫైల్‌ను ఛైర్‌పర్సన్ ఆమోదం కోసం పంపామన్నారు. దానిపై గత నెల 22న సంతకం చేశారన్నారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి.. పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.

మద్యం దుకాణాలకు 2,807 దరఖాస్తులు
నేటితో దరఖాస్తు గడువు పూర్తి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం పాలసీలో భాగంగా మద్యం దుకాణాల దరఖాస్తు స్వీకరణ గడువు శుక్రవారం సాయంత్రం ఏడు గంటలతో ముగియనుంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి జిల్లాలో 182 దుకాణాలకు కలెక్టర్ ఆనంద్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అదే రోజు నుంచి జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పది రోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 2,807 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా నెల్లూరు నగరంలో 30 దుకాణాలకు 557 దరఖాస్తులు దాఖలయ్యాయి. అతి తక్కువగా అల్లూరు నగర పంచాయతీలోని నాలుగు దుకాణాలకు 17 దరఖాస్తులు వేశారు. శుక్రవారం సాయంత్రం ఏడు గంటల్లోపు క్యూలో ఉన్న వారందరి దరఖాస్తులు స్వీకరించనున్నారు. వ్యాపారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ మోడ్‌లో దరఖాస్తులు దాఖలా చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు సూచించారు.

14న జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా ఈ నెల 14న ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు కంపెనీల ప్రతినిధులు రానున్నారని.. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో కోర్సులు పూర్తిచేసుకున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండు విమానయాన సంస్థలకు జరిమానా
బ్యాగేజీ నిబంధనలకు విరుద్ధంగా రుసుం వసూలు చేసినట్లు నిర్ధారణ ● నెల్లూరు వినియోగదారుల కోర్టు తీర్పు



నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: టికెట్‌లో సూచించిన బ్యాగేజ్ నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికుల నుంచి అదనంగా రుసుము వసూలు చేసిన లుఫ్తాన్స జర్మన్, టాటా ఎస్ఐఏ విమానయాన సంస్థలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు జరిమానా విధించింది. నెల్లూరు నగరం పొగతోటకు చెందిన గంగిశెట్టి బాబులు తనతో పాటు భార్యకు లుఫ్తాన్స జర్మన్ ఎయిర్ లైన్ సంస్థ వెబ్‌సైట్ ద్వారా చెన్నై నుంచి డాలస్‌కు రానూ పోనూ టికెట్లు బుక్ చేశారు. 2022 ఫిబ్రవరి 7న చెన్నై నుంచి అమెరికాలోని డాలస్‌కు, మార్చి 18న డాలస్ నుంచి చెన్నైకి తిరిగి వచ్చేలా ప్రయాణ తేదీలను ఎంచుకున్నారు. జారీ చేసిన టికెట్లలో.. ఒకే టికెట్‌తో కనెక్టింగ్ విమానాల ద్వారా ప్రయాణం ఉంటుందని, ఒక్కో ప్రయాణికుడి వెంట 2 చెక్ ఇన్ బ్యాగులు, ఒక క్యారీ ఆన్ బ్యాగ్ అనుమతిస్తామని ముద్రించి ఉంది. ఫిబ్రవరి 7న బాబులు, అతని భార్య 4 చెక్ ఇన్ బ్యాగులు, 2 క్యారీ ఆన్ బ్యాగులతో చెన్నై టెర్మినల్‌లోని టాటా ఎస్ఐఏ సంస్థ బ్యాగేజ్ కౌంటర్‌కు చేరుకున్నారు. ఆ సంస్థ ప్రతినిధి ఇద్దరు ప్రయాణికులకు కలిపి 2 చెక్ ఇన్ బ్యాగులు, 2 క్యారీ ఆన్ బ్యాగులను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. మిగిలిన 2 చెక్ ఇన్ బ్యాగులకు రూ.33,675 ఛార్జీలు చెల్లించాలని సూచించారు. టికెట్ పైనున్న నిబంధనలను వివరించేందుకు బాబులు ప్రయత్నించినా, అక్కడి కౌంటర్ ఇన్‌ఛార్జి పట్టించుకోలేదు. గత్యంతరం లేక బాబులు దంపతులు రూ.33,675 చెల్లించి డాలస్‌కు వెళ్లిపోయారు.

తిరుగు ప్రయాణంలో.. దిల్లీలో..

బాధితులు అమెరికా నుంచి తిరుగు ప్రయాణాన్ని ప్రారంభించే ముందే లుఫ్తాన్స జర్మన్ సంస్థ కస్టమర్ సర్వీసుకు రెండు సార్లు ఫోన్ చేసి బ్యాగేజ్ రూల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరి తరఫున మొత్తంగా 4 చెక్ ఇన్, 2 క్యారీ ఆన్ బ్యాగులను చెన్నై వరకూ అనుమతిస్తామని తెలిపారు. మార్చి 18న వీరు డాలస్‌లోని ఫోర్ట్‌వర్త్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని లుఫ్తాన్స సంస్థ చెకింగ్ కౌంటర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి దిల్లీ వరకు మొత్తం లగేజీకి అనుమతించారు. అయితే, దిల్లీ నుంచి చెన్నైకి ఎయిర్ ఇండియా సంస్థ ప్రతినిధులు ఒక్కొక్కరి వెంట ఒక్కో క్యారీ ఆన్, ఒక్కో చెక్ ఇన్ బ్యాగులకు మాత్రమే అనుమతి ఉందని స్పష్టం చేశారు. మిగిలిన రెండ్ చెక్ ఇన్ బ్యాగులకు రూ.25,200 వసూలు చేశారు. దీంతో బాధితులు వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. విచారణలో భాగంగా టికెట్‌లో సూచించిన బ్యాగేజ్ నిబంధనలు ఎందుకు పాటించలేదని న్యాయమూర్తి జింకా రెడ్డిశేఖర్ విమానయాన సంస్థల తరఫు న్యాయవాదులను ప్రశ్నించారు. అమెరికా, కెనడాలకు ప్రత్యేక నిబంధనలు ఉండటం వల్ల అనుమతించలేదని వారు తెలిపారు. 4 కనెక్టింగ్ విమానాలతో కూడిన ప్రయాణానికి ఒకే టికెట్ జారీ చేసినప్పుడు, టికెట్‌లో ఆయా దేశాల బ్యాగేజ్ రూల్స్‌ను ప్రత్యేకంగా పొందుపరచి ఉండాల్సిందని జడ్జి స్పష్టంచేశారు. ఆ నిబంధనలు వివరించకపోగా, టికెట్‌లో పేర్కొన్న నిర్దిష్ట చెక్ ఇన్ బ్యాగ్‌లను అనుమతించకపోవడం సేవా లోపంగా నిర్ధారించారు. కేసు విచారణలో ఉండగానే ఎయిర్ ఇండియా సంస్థ బాధితుడికి రూ.25,200 చెల్లించింది. దీంతో బాధితుడి వద్ద వసూలు చేసిన రూ.33,675, మానసిక వేదనకు గానూ రూ.30 వేలు, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు కలిపి మొత్తంగా రూ.68,675 జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. తీర్పు వెలువడిన 45 రోజుల్లోగా ఈ మొత్తాన్ని అందజేయాలని లుఫ్తాన్స జర్మన్, టాటా ఎస్ఐఏ విమానయాన సంస్థలను ఆదేశించారు.

పల్నాడు డీటీడబ్ల్యూవోగా జోత్స్న

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : పల్నాడు డీటీడబ్ల్యూవో జోత్స్న డిప్యుటేషన్‌పై నెల్లూరు ఐటీడీఏ జిల్లా కార్యాలయంలో ఏపీవోగా పనిచేస్తున్నారు. ఆమె డిప్యుటేషన్‌ను ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ భార్గవి రద్దు చేస్తూ గురువారం ఆదేశాలు ఇచ్చారు. ఆదేశాల్లో భాగంగా పల్నాడు డీటీడబ్ల్యూవోగా బదిలీ చేశారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,236
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 57,888
వెండి గ్రాము :	రూ. 94.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	241
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	115
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	195

పరాయి పంచన విధులు



ఇది మర్రిపాడు మండల వ్యవసాయ శాఖ కార్యాలయం. 30 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే కార్యాలయం మొత్తం ఉరుస్తోంది. శ్లాబు పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థలో వ్యవసాయశాఖ భవనాలు



కొడవలూరులో ప్రారంభంకాని వ్యవసాయశాఖ కార్యాలయ భవనం

న్యూస్‌టుడే, నెల్లూరు(వ్యవసాయం), మర్రిపాడు, కందుకూరు పట్టణం

వ్యవసాయరంగానికి ఎంతో ప్రాధాన్యం ఉన్న జిల్లాలో వ్యవసాయాధికారులు విధులు నిర్వహించేందుకు సరిపడా భవనాలు లేవు. ఉన్నవి శిథిలావస్థకు చేరాయి. అందులోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖకు జిల్లా అధికారి కార్యాలయంతో పాటు నెల్లూరు, కోవూరు, కావలి, ఇందుకూరుపేట, పొదలకూరు, వింజమూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కందుకూరు ఇలా మొత్తం 9 సబ్ డివిజన్‌లున్నాయి. ఆయా ప్రాంతాల్లో సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో ఏడీఏతో పాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పనిచేస్తారు. మండల కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు ఉంటారు. వీరి పరిధిలో రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ విస్తరణాధికారులు, విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పనిచేస్తుంటారు.

బిక్కుబిక్కుమంటూ సేవలు..

ఆత్మకూరు, కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా కార్యాలయంలో ఉద్యోగులు గొడుగుల ఆధారంగా పనిచేయాల్సి వస్తోంది. కందుకూరు ఏడీఏ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో సమీపంలోని ప్రభుత్వ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. విడవలూరు మండల వ్యవసాయశాఖ కార్యాలయం పాతకాలం నాటిది కావడంతో సమీపంలో గతంలో ఆధార్ కేంద్రం ఉన్న గదిలో ప్రస్తుతం నడుస్తోంది. బుచ్చి, కందుకూరు మండల వ్యవసాయశాఖ కార్యాలయాలు శిథిలావస్థలో ఉండగా వాటిల్లో పనిచేసే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

వైకాపా ప్రభుత్వం పట్టించుకోక..

కొడవలూరు మండల వ్యవసాయ కార్యాలయ నూతన భవనానికి 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. అప్పట్లో శంకుస్థాపన చేయగా.. 2019కి పనులు పూర్తయ్యాయి. కరెంటు కనెక్షన్‌తోపాటు నీటి ట్యాంక్ వంటి వసతులు కల్పిస్తే వినియోగంలోకి వచ్చేది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసింది. ప్రస్తుతం భవన ప్రాంగణం పిచ్చిమొక్కలతో నిండిపోయి విషపురుగులకు ఆవాసంగా మారింది. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయశాఖాధికారి, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సత్యవాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి

కొడవలూరులోని భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించి ప్రత్యామ్నాయంగా తగిన చర్యలు తీసుకుంటాం.

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

మద్యం షాపులకు పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ

ఉదయగిరి, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఎక్సైజ్ జిల్లా అధికారి ఏ.శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తు చేసుకోవడాన్ని ఎవరూ అడ్డుకొనే పరిస్థితి ఉండదన్నారు. దరఖాస్తుదారులకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 182 మద్యం దుకాణాలుండగా ఒక్కో దుకాణానికి సగటున 16 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఉదయగిరి సర్కిల్‌లో ఒక్కో దానికి 10 వచ్చాయన్నారు. ఈనెల 14న నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టరు సమక్షంలో డ్రా తీస్తామన్నారు. డ్రాలో మద్యం దుకాణాలు వచ్చిన వారికి 15వ తేదీలోపు లైసెన్సులు జారీ చేస్తామన్నారు. 16వ తేదీ నుంచి వ్యాపారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎక్సైజ్ సీఐ టి.లక్ష్మణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు 16 సమస్యలు

కావలి, న్యూస్‌టుడే: డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 16 వినతులు వచ్చాయి. గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు సమాధానం తెలిపారు. వీటిపై డీఎం సానుకూలంగా స్పందించి తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. పామూరు, చాకలికొండ రూట్లలో కొత్త బస్సులు రాగానే ఏర్పాటు చేస్తామన్నారు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి :80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: కొండాపురం బీసీ కాలనీలో అంతర్గత రోడ్డు అధ్వానంగా ఉంది. చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. **-అశోక్, గ్రామస్థుడు**

సమాధానం: అధికారులకు తెలిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి**

? పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రిళ్లు వాహన చోదకులను వెంటబడుతున్నాయి. **-వెంకటసీతాలక్ష్మి, ఉత్తర జనతాపేట**

✓ కుక్కల సంతాన నియంత్రణ శస్త్రచికిత్సను తిరిగి ప్రారంభిస్తున్నాం. ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- శ్రావణ్‌కుమార్, కమిషనర్**
- న్యూస్‌టుడే, కావలి,

? మండలంలోని దారకానిపాడులో మన్నేరు వద్ద విద్యుత్తు పరివర్తకాల వద్ద పిచ్చిమొక్కలు పెరగడంతో సరఫరాలో అంతరాయం కలుగుతోంది. **- కె.మధు, స్థానికుడు**

✓ సిబ్బందికి తెలిపి సరిచేయిస్తాను. **- శ్రీనివాసరావు, విద్యుత్తు ఏఈ, - న్యూస్‌టుడే, గుడ్లూరు**

? లింగసముద్రంలోని పెట్రోలు బంకు సమీపంలో రోడ్డుపై నీరు ప్రవహిస్తుంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- మల్లికార్జున, గ్రామస్థుడు - న్యూస్‌టుడే, లింగసముద్రం**

✓ పరిశీలించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. **- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి, లింగసముద్రం**

? కాకుటూరు పంచాయతీ పరిధిలోని బొంతవారిపాలెంలో ప్రధాన బజారులో రెండు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. **- మాల్యాద్రి, స్థానికుడు**

✓ పరిశీలించి సర్పంచితో మాట్లాడి వెలగని దీపాలకు మరమ్మతులు చేయిస్తా.
- అబ్దుల్ బారీ, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

? మండలంలోని గ్రద్దగుంటలో రహదారి గుంతలుగా మారి ప్రమాదకరంగా ఉంది.
-నాగయ్య, గ్రద్దగుంట

✓ మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.
-నాగరాజు, ఏఈ, ర.భ, - న్యూస్‌టుడే, అల్లూరు

పైడేరు.. వినియోగిస్తే సిరులు


పైడేరు వాగు

న్యూస్‌టుడే, అల్లూరు

డెల్టాలో నీటి వనరులు ఉన్నా చేలకు చేరడం లేదు. రైతులకు సాగు కష్టాలు తప్పడం లేదు. రూ.వేల కోట్లు వ్యయం చేస్తున్న ప్రభుత్వాలు తక్కువ వ్యయంతో సాగునీటిని సద్వినియోగం చేసుకునే వెసులుబాటు ఉన్నా చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ఉదాహరణ మండలంలో ప్రవహిస్తున్న పైడేరు. దగదర్తి ప్రాంతం నుంచి ప్రారంభమయ్యే దీనిద్వారా ఏటా వేలాది క్యూసెక్కుల నీరు సముద్రానికి పోతోంది. దీన్ని చెక్‌డ్యాంల ద్వారా డెల్టాకు వినియోగించుకునే సదుపాయం ఉంది. బ్రిటీష్ పాలకులు ఇలా నిర్మాణం చేసి అల్లూరు డెల్టాకు నీటిని తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికీ ఈవిధానం సాగుతోంది. ఇది నార్తుఆములూరు ప్రాంతంలో ఉంది. దీని మాదిరిగా డెల్టాలో పురిణి, ఇందుపూరు చెరువులకు ఏర్పాటుచేసుకొనేందుకు అవకాశం ఉంది. ఈప్రాంతంలో వాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే వరద నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. గత తెదేపా ప్రభుత్వంలో ఇందుకోసం నిధులు మంజూరయ్యాయి. తరువాత ప్రభుత్వంలో ఈ ప్రతిపాదనలు అటకెక్కాయి. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తే అల్లూరు, విడవలూరు ప్రాంతంలోని రైతులకు సాగునీటి సమస్య తీరుతోంది. దాదాపు రెండు వేల ఎకరాలకు నీరు అందుతోంది. ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ సుధీర్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కూరగాయల సాగుకు అనుకూలం

వెంకయ్య, పురిణి

పైడేరులో చెక్‌డ్యాం ఏర్పాటుతో చాలా ఉపయోగాలు ఉన్నాయి. మొదటి పంట తరువాత కూరగాయల సాగు చేసుకోవచ్చు. ఆరుతడి పంటలు వేసుకోవచ్చు. ఈ దిశగా చర్యలు తీసుకుంటే రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

సేవల్లో తరించి.. పేదల మనసుల్లో నిలిచి


మహిళలకు ఔషధ వితరణలో రమ్య

న్యూస్‌టుడే, కావలి

పట్టణంలో పలువురు వైద్యులు సేవాభావంతో పనిచేస్తున్నారు. పేదల ఆరోగ్యం మెరుగుకు పాటుపడుతున్నారు. శిబిరాలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు పట్టణ ఆరోగ్య కేంద్రాల మహిళా వైద్యులు. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక శిబిరాలకు సమయం కేటాయిస్తున్నారు. ప్రధానంగా పేదల నివాస ప్రాంతాల్లో జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. తక్కువ ఖర్చుతో లభించే పోషకాహారాలపై వివరిస్తున్నారు. జేబీ విద్యాసంస్థలకు అనుబంధంగా నడిచే రామ్ సెంటర్ కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరై సేవలు అందిస్తున్నారు.

భ్రూణ హత్యల నివారణకు..

భ్రూణహత్యలను నివారించేందుకు కావలి పాతూరు రాజీవ్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు లక్ష్మీనారాయణమ్మ విస్తృతంగా పాటుపడుతున్నారు. ఆడ, మగ తేడాల భావన రాకూడదంటున్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని వివరిస్తున్నారు.

మహిళల సంక్షేమానికి

వెంగళరావునగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే వైద్యురాలు టి.రమ్య గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మెరుగుపడేందుకు సూచనలిస్తున్నారు. వారిలో పోషకాల విలువలను పెంచే ఔషధాలను అందజేస్తున్నారు. ఐరన్, ఫోలిక్, కాల్షియం పోషకాలు అందేలా చూస్తున్నారు. ప్రభుత్వం తరఫున లభించే ఉచిత పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. కావలి ఉప కారాగారంలో ఖైదీలకు న్యాయపరమైన అంశాలపై అవగాహనలో ముందుంటున్నారు.


పౌష్టికాహారం అందిస్తున్న లక్ష్మీనారాయణమ్మ

వృథాగా పోతున్న నీరు



మండలంలోని కొత్తపాలెంలో నీటి సరఫరా పథకం పైపులు పగిలి వృథాగా నీరు పోతోంది. ఇది బీసీ కాలనీలోని నివాసాల ముందు చేరి బురదమయింగా మారడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు పంచాయతీ పాలకులకు తెలిపినా మరమ్మతులు చేపట్టక పోవడంతో వృథాగా పోయే నీటికి అదుపు లేదన్నారు. ఎంపీడీవో బ్రహ్మయ్య మాట్లాడుతూ పంచాయతీ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టి వృథా నీటిని నియంత్రిస్తామన్నారు. **- జలదంకి, న్యూస్‌టుడే**

మరమ్మతులకు గురైన మోటారు.. తాగునీటికి అవస్థలు



మోటారు మరమ్మతులకు గురై వారం రోజులు దాటినా బాగు చేయించకపోవడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నట్లు పోకలవారిపల్లి ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. మోటారు మరమ్మతులు చేయించేందుకు బయటకు తీసి బిగించలేదు. దీంతో తాగునీటికి అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. దీన్ని ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి జీవన్ దృష్టికి తీసుకెళ్లగా మోటారును బిగించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, సీతారామపురం**


నీటిలోనే రాకపోకలు

మాచవరం కొండదగ్గర ఉన్న కాలనీలో చినుకుపడితే సిమెంట్ రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. అందులోనే రాకపోకలు చేయాల్సిన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవటంతో ఈ దుస్థితి వచ్చిందని చెబుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు వివరణ కోరగా పరిశీలించి నీరు నిల్వ లేకుండా చూస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**



ఔరా.. ఉంగరం భలే!

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరుకు చెందిన వైవీ ప్రతాప్‌రెడ్డి మాజీ సైనికుడు. కొన్నేళ్లుగా జాతీయ జెండాను తన వాహనానికి ఏర్పాటుచేసుకొని



గ్రామాల్లో సంచరిస్తూ జాతీయ జెండా విశిష్టతపై ప్రచారం చేసేవారు. తాజాగా 17 గ్రాముల బంగారంతో ధర్మస్థాపంతో చేసిన ఉంగరాన్ని ధరించారు. గురువారం బిట్రగుంట రైల్వే క్రీడా మైదానంలో ధరించి వాకింగ్ చేస్తుండగా యువకులు గమనించి పలకరించారు. దేశభక్తికి చిహ్నంగా దీన్ని ధరించానని ఆయన చెప్పారు.
- న్యూస్‌టుడే, బిట్రగుంట


కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న భక్తులు

శివాలయ నిర్మాణానికి విరాళాలు

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం గుడ్లూరులో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి గురువారం భక్తులు విరాళాలు అందజేశారు. గుడ్లూరుకు చెందిన నూనె బాలాజీరావు, రాజ్యలక్ష్మి రూ.50,116, గుర్రం బాబు, వాణి రూ.50,116, చెన్నారెడ్డి శ్రీనివాసులు రూ.25000 నగదు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పి.వేణు, రాఘవులు, సోమానాయుడు,రామచంద్రారెడ్డి, కొండయ్య శ్రేష్ఠి తదితరులు పాల్గొన్నారు.





కావలి: వడ్డిపాలెంలో కనకదుర్గగా.. ఉదయగిరి: కనకదుర్గగా పార్వతీదేవి.. వింజమూరు: దుర్గాదేవిగా అన్నపూర్ణాదేవి

దుర్గమ్మా..పాహిమాం!

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి: వింజమూరు, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో గురువారం వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పోటెత్తడంతో కిక్కిరిశాయి. పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.


దగదర్తి :కుంకుమ పూజ చేస్తున్న భక్తులు


కందుకూరులో వాసవీమాత


సీతారామపురం: మహిషాసురమర్దనిగా వాసవీకన్యకాపరమేశ్వరి

పేదలకు దుస్తుల వితరణ

వరికుంటపాడు : పేదలు దసరా పండగను ఘనంగా జరుపుకోవాలని వినియోగదారుల ఫోరం ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రినాయుడు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ చల్లగాలి వెంకటమోహన్ పేర్కొన్నారు. స్థానిక బొగ్గు బట్టీల వద్ద పనులు చేస్తున్న గిరిజనులకు ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన దర్శి సత్యనారాయణ, పాబోలు శివ సౌజన్యతో గురువారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర యూత్ స్టీరింగ్, మానిటరింగ్ ప్రెసిడెంటు ధనెంకుల వెంకటనవీన్, మండల జనరల్ సెక్రటరీ పొద మల్లికార్జున, అగ్రికల్చర్ అడ్వైజర్ మట్టే నరేష్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

అల్లూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఎంపీడీఓ రజినీకాంత్, ఈఓపీఆర్డీ వీరేంద్ర, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకమవుదాం

కావలి : బలహీనవర్గాలకు చెందిన అన్ని కులాలు ఏకతాటిపైకి రావాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అద్దంకి ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ కోఆపరేటివ్ కాలనీలో ప్రారంభిస్తున్న తమ ఐక్యవేదిక భవన్‌కు బీసీలంతా భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, నాయకులు బీద రవిచంద్ర, గిరిధర్, బూదాటి రాధయ్య, దేవరాల సుబ్రహ్మణ్యం హాజరవుతారన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

జలదంకి : గ్రామాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కావలి ఏఎంసీ మాజీ డైరెక్టర్ పచ్చా పెంచల్‌నాయుడు తెలిపారు. గురువారం బాధ్యతలు చేపట్టిన మండల తహసీల్దార్ ఎం.ప్రమీలను తెదేపా మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. తెదేపా మండల ఉపాధ్యక్షుడు కంచర్ల వినోద్ నాయుడు, జి.చిన్నబ్బయ్య, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సదుపాయాల కల్పనకు చర్యలు

జలదంకి : పంచాయతీల్లో సదుపాయాలు కల్పించేలా పాలకులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బ్రహ్మయ్య సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జి.వెంకటరమణయ్య అధ్యక్షతన అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలతో మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో సమస్యలను పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తెచ్చారు. ఉప ఎంపీపీ పి.మాలకొండారెడ్డి, ఉప తహసీల్దార్ జూలియాబాయ్ పాల్గొన్నారు.

టాటా మృతి బాధాకరం: ఎమ్మెల్యే

కావలి : ప్రపంచం మెచ్చిన వ్యాపార దిగ్గజం రతన్ టాటా మరణం కలచివేసిందని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి బాధాకరమని, ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును గురువారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకటరావు తెలిపారు. పెదపవని నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామన్నారు. అపరాధ రుసుం విధించనున్నట్లు ఎస్సై వివరించారు.

రైల్వేక్వార్టర్స్‌లో చోరీ

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో చోరీ చోటుచేసుకుంది. గురువారం వేకువజామున రైల్వే ఉద్యోగి వెంకటరమణ ఇంట్లోకి దొంగలు చొరబడ్డారు. ఆసమయంలో ఇంటి వరండాలో వెంకటరమణ కుటుంబీకులు నిద్రిస్తున్నారు. ఇంట్లోకి వెళ్లిన అగంతకులు బీరువాలోని 72 గ్రాముల బంగారు నగలను అపహరించుకుపోయారు. కావలి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి వాహనం బోల్తా

సీతారామపురం, న్యూస్‌టుడే : వాహనం అదుపుతప్పి పడిపోయిన సంఘటన మండలంలోని పోలంగారిపల్లి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన ఎర్టిగా కారు వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో వాహనం నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. అతను వేరే వాహనంలో వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్తు స్తంభంపై నుంచి పడి గాయాలు

వింజమూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని దేవత మహల్ కూడలి నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే రహదారిలో రోడ్డు మధ్యలో శిథిలమైన విద్యుత్తు స్తంభాన్ని గురువారం మారుస్తూ ప్రమాదవశాత్తూ కింద పడి ఒకరికి గాయాలయ్యాయి. డిస్కం ఏఈ నాగూర్‌వలి మాట్లాడుతూ స్తంభం ప్రమాదకరంగా ఉండడంతో మార్చే క్రమంలో కాంట్రాక్టర్ వద్ద పనిచేసే కార్మికుడు ప్రమాదానికి గురయ్యారన్నారు. అతను మండలంలోని చంద్రపడియకు చెందిన వెంకటేశ్వర్లు అని చెప్పారు. వింజమూరు ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన చికిత్సకు నెల్లూరు తరలించారు.


రైలులో నుంచి పడి యువకుడి మృతి

కావలి, న్యూస్‌టుడే: పట్టణ శివారు రుద్రకోట చెరువు సమీపంలో రైలులో నుంచి జారి పడి యువకుడు దుర్మరణం చెందాడు. గురువారం బిహార్‌కు చెందిన వివేక్‌కుమార్ (20) ఈ ఘటనలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పట్టణంలోని ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

వైకాపా నాయకుల పరామర్శ

కావలి : డీసీఎమ్మెస్ మాజీ డైరెక్టర్ దామిశెట్టి మల్లికార్జుననాయుడ్ని పలువురు వైకాపా నాయకులు గురువారం నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రిలో పరామర్శించారు. ఈసందర్భంగా ఆపార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ పోలీసు యంత్రాంగం సమర్థంగా వ్యవహరించాలని కోరారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రసాద్‌యాదవ్, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


ఎమ్మెల్యే చేతుల మీదగా విరాళం అందజేస్తున్న దాత

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆసుపత్రిని పరిశీలించారు. అందుతున్న వైద్యసేవలు, నెలకొన్న ఇబ్బందులు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి దూర ప్రాంత రోగులకు పగటిపూట వైద్యసేవలు అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. పట్టణానికి చెందిన దాత బొగ్గవరపు నరసింహం ఆసుపత్రిలో వైద్య పరికరాల కొనుగోలుకు రూ.2.1లక్షలు విరాళాన్ని ఎమ్మెల్యే చేతుల మీదగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శకుంతలకు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లేశ్వరరావు, రవిచంద్ర, పులినాగరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, న్యూస్‌టుడే : ఇన్‌ఛార్జి మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎ.అప్పాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న దేవరకొండ ఈశ్వరమ్మను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. కలిగిరి మండల ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న అప్పాజీని ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఉన్నతాధికారులు నియమించటంతో బాధ్యతలు స్వీకరించారు.
వరికుంటపాడు, న్యూస్‌టుడే: ఎంపీడీవోగా వేణుగోపాల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇదే కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తూ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎన్.మల్లికార్జున దుత్తలూరు ఈవోపీఆర్డీగా వెళ్లారు.

పల్లె ప్రగతికి బాటలు

నిధుల కేటాయింపుతో పనులు షురూ!


దుత్తలూరు మండలం జంగాలపల్లిలో రూ. 20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు

న్యూస్‌టుడే, దుత్తలూరు

వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. వీటికి కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించింది. దీంతో గ్రామాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో ప్రజలు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంచిరోజులు వచ్చాయి. నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి బాటలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెల్లో వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా రహదారుల పనులు చేపట్టనున్నారు. ఈమేరకు నిధులు కేటాయించారు.

ఉదయగిరి నియోజకవర్గంలో దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, జలదంకి, కొండాపురం తదితర మండలాలుండగా 143 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో రూ. 36.9 కోట్ల ఉపాధి హామీ నిధులతో 1685 పనులు చేపట్టాలని ప్రతిపాదనలు తయారు చేశారు. గ్రామాల్లో సిమెంట్, గ్రావెల్ రహదారులకు మొదటిగా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏ గ్రామంలో ఏ పనులు చేపట్టాలో ఇప్పటికే సంబంధిత అధికారులు కార్యాచరణ రూపొందించి పనులు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వెళ్లకుండా స్థానికంగా పనులు కల్పించేందుకు కేంద్రం ఉపాధి హామీ పథకం ద్వారా రూ. కోట్లు కేటాయిస్తోంది. ఈ నిధులను గ్రామాల్లో అభివృద్ధి పనులకు అనుసంధానం చేసి పల్లెల రూపురేఖలు మార్చి వేతనదారులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామసభల్లో వచ్చిన వినతుల్లో ముఖ్యమైన వాటిని గుర్తించి వాటిని మొదటి విడతగా చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో ప్రారంభించారు.

నియోజకవర్గంలో వివరాలు ఇలా..

మండలం	మొత్తం పంచాయతీలు	గుర్తించిన పనులు	వ్యయం (రూ. కోట్లలో)
దుత్తలూరు	17	135	3.4
కొండాపురం	19	278	7
ఉదయగిరి	17	145	4.2
వరికుంటపాడు	24	248	5
వింజమూరు	12	227	5.6
జలదంకి	17	218	4.7
సీతారామపురం	14	158	3.1
కలిగిరి	23	276	3.9

ప్రాధాన్యక్రమంలో చేస్తాం

రవీంద్రనాథ్, ఏఈ, పీఆర్

పంచాయతీల్లో ప్రతిపాదించిన పనులన్నీ ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పల్లెల్లో చేయాల్సిన వాటిని గుర్తించి ఉపాధి నిధులతో చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా వేతనదారులకు ఉపాధి కల్పనతోపాటు పల్లెల ప్రగతికి బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అన్ని గ్రామాల్లో త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

కోవూరు
• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు



అనుమసముద్రం చెరువుకు సోమశిల నీరు విడుదల

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలం అనుమసముద్రం గ్రామ చెరువుకు గురువారం సోమశిల నీటిని అధికారులు విడుదల చేశారు. ఉత్తరకాలువ ద్వారా రాజవోలు చెరువుకు అక్కడి నుంచి రాళ్లపాడు వరకు నీరు వెళుతోంది. ఇటీవల నిర్మించిన కాలువ ద్వారా అనుమసముద్రం గ్రామ చెరువుకు సోమశిల ఏఈ శ్రీనివాసులు రెడ్డి విడుదల చేశారు. దీంతో సుమారు 1500 ఎకరాల్లో వరి సాగుకు అవకాశం కలుగుతుందని స్థానిక తెదేపా నాయకులు పి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తెగిపడిన విద్యుత్తు తీగలు.. తప్పిన ప్రమాదం

చేజర్ల, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లిలో గురువారం రాత్రి విద్యుదాఘాతంతో తీగలు తెగిపడ్డాయి. మంటలు రేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. తెగిన తీగలు చెట్టు మీద పడటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు నియంత్రిక వద్ద సరఫరా ఆపేసి విద్యుత్తు శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది గ్రామానికి చేరుకుని మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: పొదలకూరు నిమ్మ యార్డులో రెండో గేటు గుర్తుతెలియని వాహనం ఢీకొని విరిగిపోయింది. రాత్రి సమయాల్లో అటువైపుగా వచ్చిన కొందరు చోరీలకు పాల్పడుతున్నారు. - **రామయ్య, స్థానికుడు.**

సమాధానం: ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. నిధులు మంజూరైన వెంటనే విరిగి పోయిన గేటు మరమ్మతులు చేయిస్తాం. - **రఘు, పర్యవేక్షకులు**

? మనుబోలులోని కోదండరామపురం ప్రధాన రహదారిపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్త సేకరించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. **-సుమన్, దుకాణదారుడు**

✓ పరిశీలించి రోడ్డుపైన చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
- గరుడయ్య, పంచాయతీ కార్యదర్శి

? విడవలూరు మండలంలోని దంపూరు, వరిణి, దండిగుంట, రామతీర్థం, రామచంద్రాపురం పలు గ్రామాల్లో వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. పంచాయతీలపై విద్యుత్తు భారం పడుతోంది. **- గ్రామస్థులు**

✓ ఆయా గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. **- నరేష్ కుమార్, ఎంపీడీవో**

ప్రమాదాల నివారణకు చర్యలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. రహదారిపై ప్రమాదాలు తరచూ జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో గురువారం హెచ్చరికల బోర్డులు, డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిని ప్రమాదరహితంగా చేయడమే లక్ష్యమన్నారు.

సీపీఎం మహాసభను జయప్రదం చేయండి

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని కామ్రేడ్ సీతాపోలయ్య భవన్‌లో 13న సీపీఎం మండల మహాసభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శేషయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాసభకు జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని కార్యకర్తలు తరలిరావాలని పేర్కొన్నారు.

సిబ్బంది సమయ పాలన పాటించండి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబాపురం సచివాలయాన్ని ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. పలు దస్త్రాలు పరిశీలించారు.

కోవూరు : కోవూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన చిలకల శ్రీహరిని తెదేపా నాయకులు వెంకట్ ఆధ్వర్యంలో పలువురు గురువారం ఆయన్ను కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. నాయకులు పెంచలయ్య, బాల రవి, తదితరులు పాల్గొన్నారు.



దళారుల దందా.. అడ్డుకునేదుండా..

కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తీరుపై విమర్శలు

☛ నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు నిలయంగా మారింది. అక్కడికి వెళ్లాలంటే క్రయ విక్రయదారులు హడలిపోతున్నారు.. మధ్యవర్తులను సంప్రదించి వారికి ముడుపులు సమర్పిస్తేనే ప్రక్రియ ప్రారంభమవుతుంది. వారి కనుసన్నల్లోనే అంతా జరుగుతోంది.. భారీ నగదు సమర్పిస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని బాధితులు వాపోతున్నారు.

☛ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిసరాల్లో ఇతర వ్యక్తులు ఉండకూడదు. కోవూరులో మాత్రం మధ్యవర్తులు లేకుండా పనులు జరగడం లేదు. అక్కడ తిష్టవేసి రిజిస్ట్రేషన్లు, ఈసీల కోసం వచ్చిన వారి వద్ద భారీగా దండుకుంటున్నారు. వారు అడిగినంత ఇవ్వకుంటే ఏదో మెలిక పెట్టి తిప్పిస్తున్నారు. సర్వే నెంబర్లు సరిగా లేవని, ఇవి ఇతర భూములని భయాందోళనకు గురిచేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు.

న్యూస్‌టుడే, కోవూరు

కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏ పనికి వెళ్లినా అధికారులకు భారీ మొత్తంలో నగదు మధ్యవర్తులకు చెల్లించాల్సి వస్తోందని పలువురు క్రయ, విక్రయదారులు చెబుతున్నారు. దస్త్రాలన్నీ సక్రమంగా ఉంటే నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉన్నా దళారులు అడ్డంకులు సృష్టిస్తున్నారు. రికార్డులు సక్రమంగా ఉన్నా అడిగినంత ఇవ్వకుంటే ఏదో ఒక సాకుతో కాలయాపన చేస్తున్నారు. వైకాపా పాలనలో ఇద్దరు దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి అందినకాడికి దోచుకున్నారు. పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ఇక్కడ దళారులే కీలకంగా ఉండటంతో విధులు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జరిపిన బదిలీల్లో ఒక్క అధికారి కూడా ఇక్కడకు వచ్చేందుకు ససేమిరా అంటున్నారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది.

ఏడాదిగా ఇన్‌ఛార్జి అధికారే దిక్కు..

నిత్యం ఇక్కడ వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఏడాది క్రితం ఇక్కడి సబ్‌రిజిస్ట్రార్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. అప్పటి నుంచి ఇతరులకు అక్కడ మరో అధికారిని ప్రభుత్వం నియమించకపోవడంతో ఇన్‌ఛార్జితోనే కొనసాగుతోంది. నెల్లూరు నగరానికి సమీపంలో ఉన్న కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాలకు చెందిన స్థిరాస్తి వ్యాపారులు, క్రయ విక్రయదారులు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. ఎన్‌హెచ్-16 జాతీయ రహదారి సమీపంలో ఉన్న గ్రామాలు ఎక్కువగా ఉండటంతో భారీగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

ఈసీ కోసం తిప్పలే..

సాధారణంగా ఎక్కువ మంది రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఈసీ కోసం వస్తుంటారు. క్రయ, విక్రయాల్లో ఎక్కువ మంది తీసుకుంటారు. అయితే ఇటీవల వేగూరుకు చెందిన ఒక వ్యక్తి ఈసీ కోసం దరఖాస్తు చేసుకుంటే కార్యాలయంలో నిబంధనల ప్రకారం రూ.600 చెల్లించాలి. ఒక అధికారి రూ.6 వేలు చెల్లిస్తేనే ఈసీ ఇస్తామని చెప్పడంతో ఆయన కంగుతిన్నారు. సామాజిక మాధ్యమాల్లో తన గోడును వెళ్లబోసుకోవడంతో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా అధికారి స్థానిక సిబ్బందిని విచారించారు. దళారుల ప్రమేయం ఉండొద్దని, మరొక సారి ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా బేఖాతరు చేస్తున్నారు. అందరికీ కనిపించేలా ఈసీ, ఇతర వాటికి సంబంధించి ఎంత చెల్లించాలో వివరాల బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సదరు అధికారి ఆదేశించినా సిబ్బంది ఏర్పాటు చేయలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన



పడమటి కంభంపాడు ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆత్మకూరు ఆర్డీవో పావని

అనంతసాగరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పడమటి కంభంపాడు ఇసుక రీచ్ సమీపంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు ఆత్మకూరు ఆర్డీవో పావని గురువారం స్థల పరిశీలన చేశారు. స్థానిక అధికారులతో చర్చించారు. ఇసుక రీచ్‌ను ప్రారంభించి భవన కార్మికుల కష్టాలను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పావనిని డీఎస్పీ వేణుగోపాల్, సీఐ గంగాధర్‌రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలోని శాంతిభద్రతలపై చర్చించారు.

రతన్ టాటాకు నివాళి

పొదలకూరు, న్యూస్‌టుడే: వ్యాపార దిగ్గజం, నిస్వార్థ సేవకుడు తన సంపాదనలో 65 శాతం సేవా కార్యక్రమాలకు కేటాయించే రతన్ టాటాకు గురువారం రాత్రి వివిధ పార్టీల నాయకులు, న్యాయ విద్యార్థి సర్వేపల్లి విశ్వరూపాచారి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. పొదలకూరు రాంనగర్ కేంద్రంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు ఆనంద్, మనోజ్, చిన్నా, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



రతన్ టాటాకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు

చెట్లతోనే మానవజాతి మనుగడ

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: చెట్లు పెంచడంతోనే మానవజాతి మనుగడ సాధ్యమవుతుందని ఎంఈవో వెంకటరత్నం తెలిపారు. బుచ్చి మండల విద్యావనరుల కేంద్రం వద్ద ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడి, ఆందోళనలకు గురైనపుడు ప్రతి ఒక్కరూ ఆకుపచ్చ వర్ణంపై దృష్టినిలిపితే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంఈవో వెంకటరత్నం

చిన్నపాటి వర్షానికే జలమయం



విడవలూరు మండల కేంద్రంలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షానికే పాదచారులు అవస్థలు పడ్డారు. కాలువల్లో పూడిక తొలగిస్తే నీరు రోడ్ల మీదకు రాకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, విడవలూరు, ముత్తుకూరు

దివ్యాంగుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

వెంకటాచలం, న్యూస్‌టుడే: మానసిక దివ్యాంగుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా సంయుక్త కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి వాణి సూచించారు. వెంకటాచలంలోని సెయింట్ జ్యూడ్స్ మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' సదర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. పిల్లలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీసి, అక్కడున్న వసతులను పరిశీలించారు. సమస్యలుంటే న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.



దివ్యాంగులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి వాణి

చెరువు కాలువ అడ్డంకుల తొలగింపు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు చెరువు కాలువ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. కాలువ సమస్యలపై అన్నదాతలు, రైతు సంఘం నాయకులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన మంత్రి పనులు చేయాలని ఆదేశించారు. 7కి.మీ పొడవున ఉన్న కాలువలో పూడికతీత పనులు ముళ్ల చెట్ల తొలగింపు పనులు చేపట్టారు.



రైతులకు ఉపయుక్తంగా కల్వర్టు ఏర్పాటు



ముత్తుకూరు నుంచి మామిడిపూడి గ్రామానికి వెళ్లే మార్గంలో పంట కాలువపై ఉన్న కల్వర్టు మూడేళ్ల క్రితం వైకాపా పాలనలో కూలిపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టగా వర్షాలకు తెగిపోయింది. రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మూడు నెలల క్రితం మరమ్మతులు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. శ్రీధర్ రెడ్డి ప్రత్యేక చొరవతో గురువారం తూములు ఏర్పాటు చేసి, రైతులకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేపట్టారు.

- న్యూస్‌టుడే, ముత్తుకూరు

తెలుగు యువత ఆధ్వర్యంలో రక్తదానం

వెంకటాచలం, న్యూస్‌టుడే: తెదేపా మండల అధ్యక్షులు గుమ్మడి రాజా యాదవ్ జన్మదిన వేడుకలు గురువారం అనికేపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించగా... యువత రక్తదానం చేశారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. విశాలాక్షి వృద్ధాశ్రమం, స్వర్ణ దీపం ఛారిటబుల్ ట్రస్టులో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనికేపల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు

దస్త్రాలు పరిశీలించిన జేడీ

సైదాపురం : పశుపోషకుల కోసం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవల్ని అందిస్తున్నట్లు జేడీ రమేష్‌నాయక్ తెలిపారు. సైదాపురంలోని పశువైద్యకేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆశాఖ ఆధ్వర్యంలో అందించే వివిధ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

సాగుదారులకు అవగాహన

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయిలోని వెలుగుకార్యాలయంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఐసీ ఏడీఏ మారుతీదేవి మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరిలో సాగు చేసుకునే రకాల గురించి రైతులకు వివరించారు. డీఐసీ ఏవో శైలజకుమారి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త సురేఖ, ఏవో ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

వెంకటాచలం, న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ మండలం పొట్టేపాళెంకు చెందిన సుమంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వెంకటాచలంలోని సెయింట్ జ్యూడ్స్ మానసిక వికలాంగుల కేంద్రంలో తల్లిదండ్రులు సురేంద్రరెడ్డి, ప్రసూనమ్మల ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు దివ్యాంగులకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందజేశారు.

అమ్మ రూపం.. ఆధ్యాత్మిక దీపం



కోనలో విజయలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి అమ్మవారు.. హాజరైన భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు, మనుబోలు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, సైదాపురం, కలువాయి, రాపూరు, ఆత్మకూరు, సంగం, ఏఎస్‌పేట, అనంతసాగరం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో వైభవంగా జరిగింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోవూరులోని గ్రామదేవత నాగావరపమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో అభయమిచ్చారు. విడవలూరులో అంకమ్మతల్లి దుర్గాదేవి అలంకరణ చేసిన అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. రాపూరు మండలం పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామపురం దసరా చావిడి వద్ద, దేవాంగులవీధిలో కొలువుదీరిన పోలేరమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకరణ ఆకట్టుకుంది. సైదాపురంలోని బాలత్రిపుర సుందరీదేవి ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారికి పూజలు చేశారు. శ్రీ కలువాయమ్మ దేవస్థానంలో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆత్మకూరు కాశీనాయన ఆశ్రమంలోని దుర్గా మల్లేశ్వర ఆలయంలో కనకదుర్గాదేవి, సరస్వతీదేవి, గాయిత్రీదేవిలు మహిషాసురమర్దినిగా పూజలు అందుకున్నారు. సంగంలో దుర్గాదేవి అలంకారంలో కామాక్షిదేవి దర్శనమిచ్చారు.సోమశిలలో ప్రముఖ శైవక్షేత్రమైన సోమేశ్వరాలయంలోని కామాక్షి అమ్మవారు భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఏఎస్‌పేట కృష్ణమందిరంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గావతారంలో దర్శనం కల్పించారు.



జొన్నవాడలో.. విడవలూరులో.. మనుబోలులో.. ఏఎస్‌పేటలో.. ఆత్మకూరులో.. అనంతసాగరంలో..

బాధలు భరించలేక బాలల పరారీ..

సర్పంచి చొరవతో పోలీసుల చెంతకు

సంగం, న్యూస్‌టుడే: బాతుల పెంపకం యజమానులు పెట్టే బాధలు భరించలేక ఇద్దరు బాలలు పరారయ్యారు. గురువారం జంగాలకండ్రిక గ్రామస్థులు వారిని గమనించి సర్పంచి సునీల్‌కుమార్‌కు సమాచారమిచ్చారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు తమ ఆవేదన వెల్లబుచ్చారు. బిట్రగుంటకు చెందిన చెంచయ్య, చెంచమ్మ దంపతుల సంతానమైన భవాని, దుర్గలు.. కావలికి చెందిన అంజయ్య వద్ద అయిదేళ్లనాడు.. నెలకు రూ. అయిదువేలు జీతం ఇచ్చే ఒప్పందంతో పనిలో పెట్టారు. సంగం సమీపంలో పొలాల్లో బాతులను తిప్పుతూ సంరక్షిస్తున్నారు. ఆ క్రమంలో బాతులను కుక్కలు తీసుకువెళుతున్నాయనే సాకుతో యజమానులు తీవ్రంగా కొడుతుండేవారు. రోజుకు రెండుసార్లు మాత్రమే భోజనం పెడుతుండేవారు. అయిదేళ్లుగా వేతనం కూడా ఇవ్వకపోవడంతో తల్లిదండ్రుల చెంతకు చేరుకోవాలని భావించారు. బుధవారం రాత్రి అందరూ నిద్రపోయిన తరువాత అక్కడ నుంచి తప్పించుకుని కాలినడకన జంగాలకండ్రిక సమీపంలో వెళుతుండగా.. అక్కడి గిరిజనులు గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ ఇళ్లకు తీసుకువెళ్లి ఆకలి తీర్చారు. సర్పంచి సునీల్‌కుమార్‌కి సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులకు అప్పగించారు. బాతుల యజమాని అంజయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిని తాను పెంచుకుంటున్నానంటూ బుకాయించడం విశేషం. బాలల తండ్రి చెంచయ్యాని పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. ఇప్పటి వరకు తమ పిల్లలకు జీతం ఇవ్వలేదని పోలీసులకు తెలిపారు. న్యాయం చేయాలని కోరారు.



అంజయ్యను విచారిస్తున్న ఏఎస్సై

నాలుగు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చేజర్ల,న్యూస్‌టుడే: మండలంలోని ఉలవపల్లి సమీపంలో పెన్నా నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను చేజర్ల ఎస్సై ఎన్.ప్రభాకర్ గురువారం స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం అనుమతించిన ప్రదేశాల నుంచి బిల్లులతో ఇసుక రవాణా చేయాల్సి ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వేమారెడ్డి తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

మనుబోలు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతిజ్ఞ కృరూ కృషి చేయాలని మనుబోలు ఎంపీడీవో జలజాక్షి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, ఉపసర్పంచులకు జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముత్తుకూరు, తోటపల్లి గూడూరులో అధికారులు మాట్లాడుతూ అదనపు ఆదాయం సాధించేందుకు ప్రతిజ్ఞ కృరూ కృషి చేయాలన్నారు.

పారదర్శకంగా మద్యం దుకాణాల వేలం



సంగం, బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల వేలం పారదర్శకంగా జరుగుతుందని **సీఐ కిశోర్** గురువారం తెలిపారు. సర్కిల్ పరిధిలో బుచ్చిరెడ్డిపాళెం, సంగం, దగదర్తి మండలాలున్నాయని పేర్కొన్నారు. బుచ్చి నగర పంచాయతీలో ఆరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం గ్రామీణ మండలాల్లో మూడేసి వంతున, దగదర్తిలో రెండు దుకాణాలు చొప్పున మొత్తం 14 ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. ప్రతి దుకాణానికి ఏడాదికి రూ.55 లక్షల వంతున ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించాలన్నారు. బుధవారం సాయంత్రానికి 14 దుకాణాలకు 207 మంది దరఖాస్తు చేశారని చెప్పారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల వరకు గడువు పొడిగించడంతో మరిన్ని పెరుగుతాయని ఆశిస్తున్నామన్నారు. 14వ తేది జిల్లా పాలనాధికారి సమక్షంలో లాటరీ విధానం ద్వారా ఎంపిక జరుగుతుందని వివరించారు. 16వ తేదీ ఉదయం నుంచి నూతన మద్యం విధానం ప్రకారం విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు.

వేడుకగా సామూహిక చండీ యాగం

విడవలూరు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు విడవలూరులోని ఎలగాలమ్మగుంట వద్ద వెలసిఉన్న శాంభవి సమేత స్వయంభు లింగేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం సామూహిక చండీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

నిల్వకు చోటు లేక.. ఆగిన పడవలు, యంత్రాలు

సంగం, న్యూస్‌టుడే: సంగం వద్ద పెన్నానదిలో బుధవారం ఇసుక తవ్వకాలు, తరలింపు నిలిచింది. పడవలు, యంత్రాలు విశ్రాంతి తీసుకుంటున్నాయి. ఇసుక నిల్వకు చోటు లేకపోవడం, లభ్యతకు అనుగుణంగా తరలింపు లేనందున ఈ దుస్థితి ఏర్పడింది. సెప్టెంబరు నెల ప్రారంభం నుంచి పడవల సాయంతో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. నిత్యం 400 ట్రాక్టర్ల ట్రక్కుల ఇసుక సేకరించే వారు. సుమారు రెండువేల టన్నుల మేర నిల్వ కేంద్రానికి తరలిస్తున్నారు. ప్రస్తుతం దాదాపుగా 30వేల టన్నుల నిల్వ ఉంది.

ప్రజలకు లభించక

లభ్యతకు అనుగుణంగా నిల్వ కేంద్రం నుంచి ఇసుక వెలుపలకు తరలించడం లేదు. గనులశాఖ నిర్వాకంతో.. స్థానికంగా ప్రజలు ఇసుకను పొందేందుకు అవకాశం కల్పించలేదు. కేవలం ట్రక్కుల ద్వారా మాత్రమే తరలిస్తున్నారు. దాంతో నిల్వ కేంద్రంలో ఇసుక భారీగా చేరింది.



పెన్నానది వద్ద పడవలు, యంత్రాలు

నాలుగు ఎకరాలు మాత్రమే..

కేవలం నాలుగు ఎకరాల్లో మాత్రమే ఇసుక నిల్వ చేసేందుకు అధికారులు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించారు. ప్రస్తుతం అక్కడ నిల్వ చేసేందుకు చోటు లేకపోవడంతో నదిలో పూడిక తొలగింపు ఆగింది. కేవలం ట్రక్కుల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. తహసీల్దారు సోమ్లానాయక్‌తో మాట్లాడుతూ.. అదనపు స్థలం సేకరించి త్వరగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో యువకుడికి గాయాలు

సంగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు గాయపడిన సంఘటన సంగంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు కె.సుదర్శన్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో ఎం.వెంకటేశ్వర్లు నాయుడిని ఢీకొట్టారు. కాలు విరగడంతో పాటు, తలకు తీవ్ర గాయమైంది. నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జూద స్థావరాలపై దాడులు

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండలంలోని పూడిపర్తి పొలాల్లో, కసుమూరు కొండపై నిర్వహిస్తున్న జూద స్థావరాలపై వెంకటాచలం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. మొత్తం 12 మంది జూదరులు పట్టుబడగా, వారి వద్ద నుంచి రూ.13860 స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

నెల్లూరు
• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

కూరగాయల మార్కెట్‌లో తూ.కొ. దాడులు



తూకాలు చూస్తున్న అధికారులు

స్పందనకు వందనం

నెల్లూరు(నవాబుపేట, బీవీ నగర్), న్యూస్‌టుడే: తూకాల్లో తేడాలు వస్తే కేసులు నమోదు చేస్తామని తూనికలు కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్ వ్యాపారులను హెచ్చరించారు. ఏసీ కూరగాయల మార్కెట్‌లో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయంటూ గురువారం 'ఈనాడు'లో 'మార్కెట్‌లో మోసం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన తూ.కొ. అధికారులు దాడులు చేశారు. తూ.కొ. డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. మార్కెట్‌లోని ప్రతి దుకాణాన్ని పరిశీలించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టరు రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలలకు 690 ట్యాబ్‌లు



డీఈవో కార్యాలయానికి వచ్చిన ట్యాబ్‌లు

నెల్లూరు(విద్య): విద్యార్థి వ్యక్తిగత అనుకూల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన పీఎంశ్రీ పాఠశాలలకు ట్యాబ్‌లు అందించనున్నారు. ఇవి గురువారం డీఈవో కార్యాలయానికి చేరాయి. జిల్లా విద్యాశాఖాధికారులు త్వరలో ఆయా పాఠశాలలకు పంపి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. డీఈవో రామారావు మాట్లాడుతూ 690 ట్యాబ్‌లు వచ్చాయని ఒక్కో పాఠశాలకు 30 చొప్పున అందించనున్నట్లు తెలిపారు.

కల్లూరుపల్లిలో గ్రావెల్ మాఫియా

కొత్తచెరువులో అడ్డగోలుగా తవ్వకాలు



చెరువులో మట్టి ఏర్పడిన భారీ గుంతలు

న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం

అడ్డుకోరన్న ధీమాతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. చెరువులో గ్రావెల్ అడ్డగోలుగా తరలిస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని కల్లూరుపల్లి కొత్త చెరువులో గత కొన్ని రోజులుగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా రెండు జేసీబీలు, పదుల సంఖ్యలో టిప్పర్లు, భారీ వాహనాలలో తరలిస్తున్నారు. రోజూ వంద నుంచి 150 ట్రిప్పుల్లో తరలిపోతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో గ్రావెల్ ధర తరలించే దూరాన్ని బట్టి యూనిట్ ధర రూ.1000 నుంచి రూ.1500 వరకు పలుకుతోంది. ఓ మోస్తరు టిప్పర్‌కు ఏడు యూనిట్లు పడుతుంది. ఈ లెక్కన రూ.7వేల నుంచి రూ.10,500 అవుతుంది. ఇక్కడ నుంచి జాతీయ రహదారికి సంబంధించి పనులకు, వాటితో పాటు అల్లీపురం, ధనలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న లేఅవుట్‌లకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అనుమతులున్నాయనే ప్రచారంతోనే..?

జాతీయ రహదారి పనుల నిమిత్తం విడతల వారీగా 1.50 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అవసరమౌవుతుందని, వెంకటాచలం, కల్లూరుపల్లి చెరువుల నుంచి గ్రావెల్ తోలుకునేందుకు ఎన్‌హెచ్ఏఐ 13-6-23న జలవనరుల శాఖను అనుమతి కోరింది. దీనిపై 50వేల క్యూబిక్ మీటర్లు అందుబాటులో ఉంటుందని, దీంట్లో కల్లూరుపల్లి కొత్తచెరువులో 25వేల క్యూబిక్‌మీటర్లు ఉంటుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి అప్పట్లో గ్రావెల్‌ను తోలినట్లు సమాచారం. ప్రస్తుతం గ్రావెల్ కోసం జిల్లా ఉన్నతాధికారుల అనుమతి కోరినట్లు సమాచారం. అనుమతి ఉందంటూ గత కొన్ని రోజులుగా ఇష్టానుసారంగా చెరువులోని గ్రావెల్ తరలిస్తున్నారు. ఒక్కోచోట 20అడుగుల మేర తవ్వేశారు. ఇలా కొద్ది రోజుల్లో తరలించిన గ్రావెల్ విలువ రూ.కోట్లు ఉంటుందని తెలుస్తుంది. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరగాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతి లేదు

జలవనరుల శాఖ ఈఈ నాగరాజును వివరణ కోరగా కల్లూరుపల్లి కొత్త చెరువులో గ్రావెల్ తవ్వకాలకు ఇప్పటికైతే అనుమతి లేదు. ఏఈని అక్కడకు పంపించి పరిశీలన చేయిస్తామన్నారు.

● నెల్లూరు రూరల్ తహసీల్దార్ లాజరస్‌ను వివరణ కోరగా కొత్త చెరువులో గ్రావెల్ తవ్వకాలు సమాచారం రావడంతో సిబ్బందిని పంపాం. అనుమతులు ఉన్నాయంటూ వారు చెప్పినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకుంటామన్నారు.

దసరా పేరుతో ప్రైవేటు దోపిడీ

నెల్లూరు(రవాణా), న్యూస్‌టుడే: దసరా పండగ పేరుతో ప్రైవేటు ఆపరేటర్లు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. తెలుగు వారి ముఖ్యమైన పండగల్లో దసరా ఒకటి. పండగకు విద్యార్థులకు పదిరోజులు, అధికారులకు మూడు రోజుల పాటు సెలవులు ఉంటాయి. నగరాలు, పట్టణాల్లో ఉన్న వారు సొంత ఊళ్లలో పండగ జరుపుకొనేందుకు వెళుతుంటారు. రైళ్లు రద్దీగా ఉంటాయని వీరంతా బస్సులు ఆశ్రయిస్తుంటారు. దీన్ని ఆసరాగా తీసుకుని ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు సాధారణ రోజుల్లో కంటే అదనంగా వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ ప్రయాణికులపై భారం మోపకుండా సాధారణ రోజుల్లో వసూలు చేసే ఛార్జీనే తీసుకుంటుందని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. సాధారణ రోజుల్లో నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేటు బస్సుల్లో రూ.700పైనే ఛార్జీ ఉంటుంది. ఇదేఛార్జీని ఈ నెల 8,9,10 తేదీల్లో నాన్ ఏసీలో వెయ్యి రూపాయలకు పైగా, ఏసీ బస్సుల్లో రూ.1300 నుంచి రూ.2400 వరకు పెంచారు. నెల్లూరు నుంచి బెంగళూరుకు సాధారణ రోజుల్లో నాన్ ఏసీలో రూ.380, ఏసీలో రూ.700 నుంచి రూ.1200 వరకు ఉంది. పండగ రోజుల్లో నాన్ ఏసీలో రూ.700కు పైగా.. ఏసీ బస్సుల్లో రూ.1200 నుంచి రూ.3వేలకు ప్రైవేటు ఆపరేటర్లు పెంచారు. ● ప్రైవేటు ఆపరేటర్లు అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉప రవాణా కమిషనర్ చందర్ హెచ్చరించారు.

ఆర్టీసీలో ఇలా..: ఆర్టీసీలో నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు నాన్ ఏసీలో రూ.830, ఏసీలో రూ.1330గా ఉంది. నెల్లూరు నుంచి బెంగళూరుకు నాన్ ఏసీ రూ.720, ఏసీలో సర్వీసును బట్టి రూ.930, రూ.1030, రూ.1320గా ఉంది.



నరసింహాకొండలో విద్యాలక్ష్మిగా ఆదిలక్ష్మి



భువనేశ్వరికి దుర్గాదేవి అలంకరణ



విరాట్‌నగర్‌లో పార్వతిగా



పప్పుల వీధిలో బొమ్మలకొలువు

కరుణించుతల్లి.. కనకదుర్గమ్మ

శరన్నవరాత్రి మహోత్సవాలలో గురువారం దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా కొలువుదీరి భక్తుల పూజలు అందుకున్నారు. నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు విద్యాలక్ష్మి, పార్వతి, భవానీ, మహా కాళిమాతగా దర్శనమిచ్చారు. స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలో శ్రీ నిత్యానంద వేద సంస్కృత పాఠశాలలో మురళీగీత బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం, స్టోన్‌హౌస్‌పేట)



రాజరాజేశ్వరికి బంగారుపూత కిరీటం అందిస్తున్న భక్తులు

దాడులు చేస్తే సహించేది లేదు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రవ్యాప్తంగా వైకాపా నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై తెదేపా నాయకుల దాడులు కొనసాగుతున్నాయని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కావలి నియోజకవర్గం వైకాపా నాయకులు దామిశెట్టి మల్లికార్జునను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులు ధ్రువపత్రం నకలు చూపాలి

నెల్లూరు(రవాణా): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్లు కండక్టర్లు అడిగిన సమయంలో ఆధార్, పాన్, ఓటరు కార్డులలో ఏదైనా వయసు తెలిసేలా ఉండే ధ్రువపత్రం నకలు చూపితే సరిపోతుందని ఆర్టీసీ డిపో-1 మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. గురువారం డిపో పరిధిలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అడిగిన సమస్యకు సమాధానమిచ్చారు.

ప్రజా సమస్యలపై పోరాటాం

నెల్లూరు(నగరపాలకసంస్థ): ప్రజా సమస్యలపై పోరాటాలే తమకు ముఖ్యమని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరురూరల్ వైకాపా ఇన్‌ఛార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఇసుకు ఉచితంగా ఇవ్వాలని గురువారం నెల్లూరురూరల్ నియోజకవర్గం కరెంటాఫీసు సెంటరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద వినూత్నంగా ఆందోళన చేపట్టారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అనిశా అధికారులు

నెల్లూరు(బృందావనం) : జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఇతర జిల్లాలకు చెందిన అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం వచ్చారు. వారికి అవసరమైన సమాచారాన్ని తీసుకుని వెళ్లిపోయినట్లు సమాచారం. అధికారుల రాకతో ఇక్కడ పనిచేసే ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం సేకరించకుని వెళ్లి పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వర్మను వివరణ కోరగా ఏ శాఖ అధికారులైన వారికి అవసరమైన సమాచారాన్ని సేకరించడం సాధారణ విషయమని, అందులో భాగంగానే ఏసీబీ అధికారులు ఇక్కడకు వచ్చారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో పందుల బెడద ఎక్కువగా ఉంది. ఇళ్లలోకి వస్తూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. – నాగేంద్రప్రసాద్

సమాధానం: పందులను పట్టించేందుకు చర్యలు చేపడతాం.

– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? హరనాథపురం రెండో వీధిలో కాలువలు పూడికతో నిండిపోయి... మురుగునీరు ముందుకు కదలడం లేదు. – సుదర్శనమ్మ

✓ కాలువల్లో పూడికలు తీయిస్తాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

బదిలీపై వెళుతున్న డీపీవోకు సన్మానం



సుస్మితను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: డీపీవోగా పనిచేసి ఉద్యోగోన్నతిపై శ్రీకాళహస్తికి బదిలీపై వెళ్లిన సుస్మితను జిల్లా పంచాయతీ, కార్యదర్శుల, విస్తరణాధికారుల సంఘాలు గురువారం సత్కరించారు. జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవో జె. మోహన్‌రావు, నూతన డీపీవో శ్రీధర్‌రెడ్డి, పలువురు ఎంపీడీవోలు, ఏవోలు మాలకొండయ్య, విజయ కృష్ణ, కార్యదర్శుల ఉద్యోగ సంఘాల సీనియర్ నేతలు శ్రీధర్, దొరబాబు, అశోక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

ఎం-1 సినిమాస్- స్క్రీన్1. .వెట్టయ్యన్, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. విశ్వం, మార్టిన్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)- స్క్రీన్1.. విశ్వం, స్క్రీన్2.. మార్టిన్, స్క్రీన్3..మానాన్న సూపర్ హీరో, జిగ్రా, విక్కీ విద్యాకా వోవాలా వీడియో, స్క్రీన్4..వెట్టయ్యన్, స్క్రీన్5..దేవర, రెయిన్‌సినిమాస్- స్క్రీన్1..దేవర, స్క్రీన్2..విశ్వం,మార్టిన్, స్క్రీన్3..వెట్టియ్యన్, స్క్రీన్4..మానాన్న సూపర్‌హీరో, జిగ్రా, మార్టిన్, సిరిమల్టీప్లెక్స్..స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. వెటయ్యన్, స్క్రీన్3..విశ్వం, స్క్రీన్4.. మార్టిన్

వివాహిత అదృశ్యం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: వివాహిత అదృశ్యంపై నవాబుపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. రామచంద్రాపురం ప్రాంతంలో వంశీకృష్ణ, రమ్య దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. వంశీకృష్ణ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొతకాలంగా ఆయన మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చాయి. ఇదే విషయంపై భార్యాభర్తల మధ్య బుధవారం రాత్రి గొడవ చోటు చేసుకుంది. మనస్తాపానికి గురైన రమ్య గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లిపోయారు. భర్త నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానవతావాది రతన్ టాటా



రతన్ టాటా మృతికి నివాళులర్పిస్తున్న వీపీఆర్ యువసేన యువత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, విద్య), న్యూస్‌టుడే: రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటు అని మంత్రి పొంగూరు నారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తగానే కాకుండా ఉన్నతమైన విలువలు కలిగిన ఆదర్శవాది అని తెలిపారు. భారతదేశ పారిశ్రామిక రంగానికి మూలస్తంభం అయిన రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. లక్షలాదిమందికి ఉద్యోగావకాశాలను కల్పించిన గొప్ప వ్యక్తి అని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. నగరంలో వీపీఆర్ యువసేన ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళులు అర్పించారు. యువసేన వ్యవస్థాపకులు అరవింద్‌రెడ్డి, సభ్యులు సుధీర్, భూపూష్, సునీల్, హరి, సతీష్, గని, అమర్ తదితరులు పాల్గొన్నారు.

వాత్సల్య ఆశ్రమంలో..

నెల్లూరు(నగరపాలకసంస్థ): సూది నుంచి విమానాల తయారీ వరకు ఎన్నో సంస్థలు నెలకొల్పిన ప్రపంచ పారిశ్రామిక దిగ్గజం, కోట్ల మందికి ఉద్యోగ ప్రదాత, సేవా తత్పరుడు రతన్‌టాటా అని జనహిత వాత్సల్య అనాథాశ్రమం కార్యదర్శి జీవీ సాంబశివరావు, ఏపీహెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. గురువారం ఆశ్రమంలో రతన్‌టాటా పేరుతో మొక్క నాటి.. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



మొక్క నాటుతున్న ఆశ్రమ నిర్వాహకులు